క్లుప్తంగా

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు


అమ్మవారి సన్నిధిలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో బోణాలు, ఒడిబియ్యం, నూతన చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

గోస్పాడు: మండలంలోని యాళ్లూరు గ్రామంలో ఆదివారం చలివేంద్రాన్ని గ్రామ సొసైటీ అధ్యక్షుడు రామ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా మహిళా విభాగ అధ్యక్షురాలు, ఉప సర్పంచ్ శకుంతలమ్మ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఎండలు అధికం కావడంతో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా మినరల్ కూలింగ్ వాటర్‌ను చలివేంద్రం ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు మజ్జిగ అందజేశారు.

రేపు వేణుగోపాల స్వామి ఆశ్రమ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి

ఉయ్యాలవాడ : మండల కేంద్రం సమీపంలో కుందూనది ఒడ్డున వెలిసిన శ్రీ వేణుగోపాలస్వామి ఆశ్రమంలో మంగళవారం నుంచి వార్షికోత్సవ వేడుకలు ప్రారంభం కానున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు మహానందిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 29వ వార్షికోత్సవాల్లో భాగంగా మంగళ, బుధ, గురువారాల్లో ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి ధార్మికోపన్యాసాలు కొనసాగుతాయన్నారు. స్వామి ఆత్మవిదానంద సరస్వతి, శ్రేయానంద సరస్వతి, సుప్రేమానంద మాతాజీ ప్రవచనాలు వినిపిస్తారని చెప్పారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు


కృతజ్ఞతలు తెలుపుతున్న వాల్మీకి సంఘం నాయకులు

నంద్యాల(అర్బన్): వాల్మీకులను ఎస్టీలుగా పునరుద్ధరిస్తూ అసెంబ్లీలో ప్రభుత్వం తీర్మానం ప్రవేశపెట్టడం పట్ల వాల్మీకి సంఘ నేతలు పులికొండన్న, లాలుస్వామి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మురళీకృష్ణ ఆదివారం ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో సంఘం నేతలు మాట్లాడుతూ అసెంబ్లీలో వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణపై తీర్మానం చేసి కేంద్రానికి పంపడం అభినందనీయమన్నారు. అయితే కేంద్రాన్ని ఒప్పించేందుకు కృషి చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు మధుగోపాల్, లాయర్ సుబ్బరాయుడు, స్వామినాయుడు, జయరాం, శివనాగేంద్ర, నాగేశ్వరరావు, ఓబులేసు, బ్రహ్మనాయుడు, సుబ్బయ్య పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ


విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న సంక్షేమాధికారి

ఉయ్యాలవాడ : స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో పదో తరగతి విద్యనభ్యసిస్తున్న 14 మంది విద్యార్థులకు పరీక్షల సామగ్రిని సంక్షేమాధికారి నాగేంద్ర ఆదివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల పట్ల భయం విడనాడి ఆత్మస్థైర్యంతో ప్రశ్నావళికి జవాబులు రాయాలన్నారు. మనోధైర్యంగా ముందుకు సాగితే విజయం వరిస్తుందన్నారు. కార్యక్రమంలో గుళ్లదుర్తి వసతి గృహ సంక్షేమాధికారి మురళీ మద్దిలేటి, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటి పూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం రోజుల పాటు సుద్దమల్ల, మాయలూరు ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు, ఇంజేడు, కొండుపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె, అక్కంపల్లె ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు.


రెడ్డిపల్లె సమీపంలో తలపై టోపీలు ధరించి పనులు చేస్తున్న కూలీలు

ఎండ నుంచి రక్షణ..

- పెరుగుతున్న వేసవి తీవ్రత
- మండిపోతున్న భానుడు
- టోపీలు, తువాళ్లు ధరించి పొలాల్లో పనులు చేస్తున్న కూలీలు
- గొడుగులతో రక్షణ పొందుతున్న పశువుల కాపరులు
- నీడ కోసం మూగజీవాల వెతలు

రుద్రవరం: భానుడి ప్రభావం రోజు రోజుకు పెరిగిపోతోంది. ఎండలు మండుతుండటంతో మనుషులతో పాలు మూగజీవాలు అల్లాడిపోతున్నారు. ఏప్రిల్ మొదటి వారంలోనే ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలు దాటుతోంది. ఉదయం పది గంటలు దాటితే బయటకు వెళ్లేందుకు జనం జంకుతున్నారు. బయటకు వెళితే వడదెబ్బ బారిన పడతామనే భయం నెలకొంది. దీంతో చాలా మంది కూలీలు పనులకు సక్రమంగా వెళ్లకపోతుండటంతో వ్యవసాయ పనులు స్తంభించి పోతున్నాయని రైతులు వాపోతున్నారు. దీంతో ఎండ నుంచి రక్షణ లభించేలా కూలీలకు కొందరు రైతులు టోపీలు అందజేస్తున్నారు. మరికొందరు మందం తువాలుతో రుమాలు ధరించి పనుల్లో పాల్గొంటున్నారు. దాదాపుగా ఎండ ముదరక ముందే పనులు ముగించుకొని ఇళ్లకు చేరుకుంటున్నారు. ఇందుకు తెల్లవారుజామునే పొలాల్లోకి వెళ్లిపోతున్నారు. ఇక పశువుల కాపరులు గొడుగులు ధరించి వాటిని మేపుతున్నారు. ఇక యువకులు, చిన్నారులు ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు చెరువులు, బావుల్లో ఈత కొడుతూ గడుపుతున్నారు. మూగజీవాలు ఎండను తట్టుకోలేక నీడను వెతుక్కుంటున్నాయి. ఎక్కడ చెట్టు ఉంటే వాటి నీడలో తలదాచుకుంటున్నాయి.

ఎండలు తీవ్రంగా ఉన్నాయి



ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నాయి. పశువులను మేపుకునే తమకు ఎండ నుంచి రక్షణ ఎంతో అవసరం. గేదెలను మేపుకునేందుకు వచ్చే సమయంలో గొడుగు, బాటిల్‌లో తాగునీరు వెంట తెచ్చుకుంటాం. గొడుగు,నీరు లేకపోతే ఇంటికెళ్లేలోపు వడదెబ్బ బారిన పడాల్సి వస్తుంది.

– నాగరాజు,పశువుల కాపరి,చిన్నకంబలూరు


మాచినేనిపల్లె వద్ద గొడుగు పట్టుకొని గొర్రెలను కాస్తున్న మహిళ


రుద్రవరం వద్ద బావిలో ఈత కొడుతున్న యువకులు


ఎర్రగుడిదిన్నె రోడ్డులో చెట్టు నీడన సేదదీరుతున్న గొర్రెలు

5 నుంచి సుందరకాండ మహాయజ్ఞం

నంద్యాల(వ్యవసాయం): ఈనెల 5వ తేదీ నుంచి లోక కల్యాణం కోసం సుందరకాండ మహాయజ్ఞాన్ని ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు భగవత్ సేవా సమాజ్ సభ్యులు సూరయ్య, శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. వారు మాట్లాడుతూ వేదపండితులు యాదవల్లి కార్తికేయ శర్మ ఆధ్వర్యంలో 5, 6, 7, 8, 9 తేదీల్లో హోమాలు, పూజలు, ప్రత్యేక కార్యక్రమాలు జరిపిస్తున్నట్లు చెప్పారు. నంద్యాలలో మునుపెన్నడూ చేయలేదని, మొదటి సారి శ్రీసుందరకాండ మహాయజ్ఞం పాంచాహ్నిక దీక్షతో ప్రాతఃకాల పూజలు, హోమాలు, ప్రతిరోజూ సాయంత్రం వైవిధ్య విశేష అర్చనలు ఉంటాయని వివరించారు.

మే 31న సిద్ధేశ్వరం అలుగు వార్షికోత్సవం

నంద్యాల(అర్బన్): మే 31న సిద్ధేశ్వరం అలుగు శంకుస్థాపన వార్షికోత్సవ కార్యక్రమాన్ని ప్రజా భాగస్వామ్యంతో నిర్వహించనున్నామని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్ష, ఉపాధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి, వైఎన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంపై త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. స్థానిక త్రినేత్ర గెస్ట్‌లైన్ పి.రామాచార్యుల ప్రాంగణంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి వార్షికోత్సవ 11వ వార్షికోత్సవ సదస్సు ఆదివారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాయలసీమ ప్రాజెక్టుల రిజర్వాయర్లలో పూర్తిస్థాయి నీటి మట్టం ఉండేలా ఉద్యమాలకు శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు మాగంటి గోపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాము, బ్రహ్మానందరెడ్డి, గుర్రప్ప, వెంకటసుబ్బయ్య, ఏర్వ రామచంద్రారెడ్డి, బాలీశ్వరరెడ్డి, కొండారెడ్డి, గౌస్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

హనుమద్వాహనంపై లక్ష్మీరంగనాథుడు

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీరంగనాథుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు ఆదివారం శ్రీ లక్ష్మీరంగనాథుడు హనుమద్వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. అర్చకులు వేదమంత్రాలు పఠిస్తుండగా స్వామివారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పుష్పార్చన, కుంకుమార్చన తదితర విశేషపూజలు చేశారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రభోత్సవ వాహనంపై ఉన్న హనుమద్వాహనంపై ఉంచారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఈశ్వరరెడ్డి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి కొబ్బరికాయలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం స్వామి వారికి గరుడ వాహన సేవ నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వెంకటరమణ, చైర్మన్ ప్రతాపరెడ్డి తెలిపారు.


స్వామి వారిని ఊరేగిస్తున్న భక్తులు

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

గోస్పాడు: నేటి నుంచి ప్రారంభకానున్న పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ అబ్దుల్ కరీం తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని పాఠశాలల్లో నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దీబగుంట్ల హైస్కూల్లో 168 మంది విద్యార్థులు, యాళ్లూరు హైస్కూల్లో 97, గోస్పాడు హైస్కూల్లో 140, ఏపీ మోడల్ స్కూల్‌లో 216 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, మొత్తం 35 మంది ఇన్విజిలేటర్లను నియమించారని వివరించారు.


మహానంది కోనేరులో భక్తుల స్నానాలు

మహానందిలో సండే సందడి

మహానంది: మహానంది ఆలయంలో ఆదివారం భక్తులసందడి నెలకొంది. సెలవురోజు కావడంతో వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల భక్తుల రాకతో ఆలయ ప్రాంగణాల్లో సందడి నెలకొంది. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక రుద్రగుండం, బ్రహ్మ, విష్ణుగుండం కోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామివార్లను దర్శించుకున్నారు. ఉదయం నుంచి ప్రారంభమైన స్వామి, అమ్మవార్ల దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది.

కోలుకోలేక వ్యక్తి మృతి

మహానంది: మద్యానికి డబ్బులివ్వలేదని మనస్తాపానికి గురైన దాట్ల నాగేశ్వరరావు(25) రెండ్రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్సై నాగార్జున రెడ్డి ఆదివారం తెలిపారు. బొల్లవరం గ్రామానికి చెందిన నాగేశ్వరరావు మద్యానికి అలవాటు పడ్డాడు. దీంతో శుక్రవారం మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని అమ్మను అడిగాడు. ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతను కోలుకోలేక శనివారం సాయంత్రం మృతి చెందాడని చెప్పారు. తల్లి దస్తగిరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మతదేహానికి పోస్టుమార్టం నిర్వహించినట్లు వెల్లడించారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు


బండలాగుతున్న వృషభాలు

కొత్తపల్లి: మండలంలోని ఎదురుపాడు గ్రామంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామ పెద్దల సమక్షంలో అంతరాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలను ఆదివారం నిర్వహించారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో కర్నూలు జిల్లా పంచలింగాల గ్రామానికి బైరపోగు సుంకన్న బ్రదర్స్ ఎద్దులు మొదటి బహుమతి రూ.30,016, అనంతపురం వీరన్నపల్లి గ్రామం నుంచి చెన్నారెడ్డి రెండో బహుమతి రూ.20,016, నంద్యాల జిల్లా ఎస్.కొత్తపల్లికి చెందిన నేతుల వెంకటేశ్వర్లు మూడో బహుమతి రూ.15,016 గెలుచుకున్నాయి. గిడ్డయ్య నాయుడు, శ్రీనివాసులు వృషభాలు నాల్గవ బహుమతి రూ.10,016, బోయ హేమంత్ ప్రసాద్ ఎద్దు ఐదో బహుమతి రూ. 6016, దాసరనేని భాస్కరరెడ్డి ఆరో బహుమతి రూ.5016, యగాల నరసయ్య ఏడో బహుమతి రూ.4016, మంగలి బాబు వృషభాలు ఎనిమిదో బహుమతి రూ.2016 దక్కించుకున్నాయి.

ఆదిత్య పుష్పం


పుష్పంలా కనిపిస్తున్న ఆదిత్యుడు

మహానంది: అందాలను ఆవిష్కరించడంలో ప్రకృతిని మించిన చిత్రకారుడు ఉండడు. సూర్యోదయం , సంధ్య వేళలో ఆవిష్కృతమయ్యే అందాలు ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తుంటాయి. అందులో భాగంగా మహానందిలో సూర్యోదయం వేళ ఆదిత్యుడు ఆకుల మధ్యలో పుష్పంగా ఒదిగిపోయిన దృశ్యం కనువిందు చేసింది.

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం

ఆత్మకూరు: రాష్ట్రంలో ఏ క్షణంలో ఎన్నికలు వచ్చినా వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని శ్రీశైలం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు పెద్ద పీటవేశారన్నారు. ఆర్థిక, రాజకీయ రంగాలతో పాటు అన్ని రంగాల్లో నిరుపేదల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అందులో భాగంగా అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, విద్యా దీవెన లాంటి ఎన్నో పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. అనంతరం కన్వీనర్లకు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఆత్మకూరు, వెలుగోడు, శ్రీశైలం మండలాల అధ్యక్షులు అంజాద్‌అలీ, రాజమోహన్‌రెడ్డి, వట్టి వెంకటరెడ్డి, విజయచౌదరి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కిట్లను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి

అమ్మవారికి పల్లకీ సేవ


స్వామిఅమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులు ఆశీనులుగావించి వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు.


వంతెనపై నుంచి నదిలోకి దూకుతూ


కుందూలో చిన్నారుల ఈత సరదా

కుందూలో ఈత.. చిన్నారుల కేరింత

దొర్నిపాడు: మండే ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు గ్రామాల్లో బావులు, చెరువులు, వాగులు, వంకల్లో ఈత కొట్టడం మామూలే. ఆదివారం సెలవు దినం కావడంతో మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలోని చిన్నారులు సమీపంలోని కుందూ నదిలో జలకాలాటలాడారు. కేరింతలు కొడుతూ.. పై నుంచి దుముకుతూ, పల్టీలు కొడుతూ ఈత కొడుతూ సరదాగా గడిపారు. ఆ కొంతసేపు వారి సంతోషానికి అవధుల్లేవు. కాగా.. ఈత కొట్టే సమయంలో జాగ్రత్తలు పాటించాల్సి ఉంది. తల్లిదండ్రులు వద్ద ఉండి పర్యవేక్షించాలి. నదిలో నీటి ప్రవాహం ఉండటం, లోతు ఎక్కువగా ఉండటంతో ప్రమాదం చోటుచేసుకోకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం


క్రిష్టిపాడులోని సీఎస్ఐ చర్చి చుట్టూ మట్టలు పట్టుకొని తిరుగుతూ ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


రూపనగుడి చర్చి వద్ద మట్టలను ప్రదర్శిస్తున్న క్రైస్తవులు

దొర్నిపాడు: మండలంలో మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. దొర్నిపాడు, క్రిష్టిపాడు, డబ్ల్యూ గోవిందిన్నె, డబ్ల్యూ కొత్తపల్లె, గుండుపాపల, బుర్రారెడ్డిపల్లె, చాకరాజువేముల గ్రామాల్లో ఉదయమే చర్చిలకు వెళ్లి ప్రార్థనలు చేశారు. యేసు క్రీస్తు మరణానికి ముందు యెరూషలేములో సందర్శించేందుకు గాడిదపై మార్గంలో వెళ్తుండగా ప్రజలంతా జయోత్సాహంతో నేలపై తమ వస్త్రాలను పరిచి కర్జూరపు మట్టలు చేతబూని క్రీస్తుకు స్వాగతం పలికారని పాస్టర్ డేవిడ్ పుష్పరాజు సందేశం వినిపించారు. ఏటా ఈస్టర్‌కు ముందు వచ్చే ఆదివారాన్ని మట్టల ఆదివారంగా క్రైస్తవులు జరుపుకోవడం ఆనవాయితీ.

ఉయ్యాలవాడ : యేసు ప్రభు అందరి కష్టాలను పరిష్కరిస్తారని పాస్టర్ విజయానంద్ తెలిపారు. మట్టల ఆదివారాన్ని పురస్కరించుకుని స్థానిక హోసన్న మందిరం, సీఎస్ఐ చర్చి, మండలంలోని పలు గ్రామాల చర్చిల్లో మట్టలతో చర్చి చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

శ్రీశైలంలో ఢిల్లీ కన్జ్యూమర్ కమిషన్ ప్రెసిడెంట్

శ్రీశైలం టెంపుల్ : ఢిల్లీ కన్జ్యూమర్ కమిషన్ ప్రెసిడెంట్ జస్టిస్ డాక్టర్ సంగీతా దింగ్ర నెహగల్ కుటుంబ సమేతంగా భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల దర్శనార్థం ఆదివారం శ్రీశైలం వచ్చారు. వీరికి రెడ్‌క్రాస్ శ్రీశైలం బ్రాంచ్ చైర్మన్ నాగ శేషయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే శ్రీశైలం రెడ్‌క్రాస్ బ్రాంచ్ తరపున సేవా కార్యక్రమాలను, శివరాత్రి, ఉగాది పర్వదినాలకు భక్తుల సౌకర్యార్థం నిర్వహించే ఉచిత వైద్య శిబిరాల గురించి వివరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు జీవీకేఎస్ ప్రసాద్, జాని తదితరులు ఉన్నారు.


జస్టిస్ డాక్టర్ సంగీతా దింగ్ర నెహగల్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రెడ్‌క్రాస్ సభ్యులు

రేపు రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

మిడుతూరు: మండల పరిధిలోని ఉప్పలదడియ గ్రామంలోని రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 4న రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు (ఆరుపండ్ల విభాగంలో) నిర్వహిస్తున్నట్లు కమతం జయరామిరెడ్డి ఆదివారం తెలిపారు. శ్రీ రామనవమి, రంజాన్, గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు నగదును అందజేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా పోటీల్లో పాల్గొన్న ప్రతి ఎడ్ల జతకు రూ.3 వేలు ప్రోత్సాహక బహుమతి అందజేస్తామన్నారు. ఆసక్తి కల ఎడ్ల యజమానులు రూ. 500 ఎంట్రీఫీజు చెల్లించి టోకన్లు పొందాలని చెప్పారు. వివరాలకు..9959435354, 9866416512, 9618446391 నంబర్లలో సంప్రదించాలన్నారు.

6వ తేదీ జీ.వీరాపురంలో..

కొత్తపల్లి: మండలంలోని జీ.వీరాపురం గ్రామంలో ఈనెల ఆరవ తేదీన సుంకుల పరమేశ్వరి దేవి జయంతి సందర్భంగా గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఆరుపండ్ల విభాగం ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 6వ తేదీ ఉదయం 8 గంటలలోపు ఎద్దుల యజమానులు ప్రవేశ రుసుము రూ.500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. విజేతలకు రూ.30 వేలు, రూ.25వేలు, రూ.20 వేలు, రూ.15వేలు, రూ.10, రూ.5వేలు బహుమతులు అందజేస్తాన్నారు. వివరాలకు 9963019710, 9866783974, 9951053466 సెల్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలను నిలపొచ్చు

కర్నూలు(హాస్పిటల్): గుండెపోటుకు గురైన వారికి సకాలంలో సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడవచ్చని విజయవాడకు చెందిన అనెస్తెటిస్ట్, బీఎల్ఎస్ ట్రైనర్ డాక్టర్ వై.అశోక్ చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండురోజులుగా స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో నిర్వహిస్తున్న బీఎల్ఎస్ వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పొందిన ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులకు ఆయన సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బేసిక్ లైఫ్ సపోర్ట్ కోర్సులో భాగంగా సీపీఆర్ ఎలా నిర్వహించాలనే దానిపై ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు డాక్టర్ చంద్రశేఖర కల్కూర, డాక్టర్ శ్రీలత, పాపారావు తదితరులు పాల్గొన్నారు.


కోర్సు అభ్యసించిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డాక్టర్ అశోక్, డాక్టర్ చంద్రశేఖర్

కొత్తూరులో న్యాయమూర్తుల పూజలు

పాణ్యం: కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం కర్నూలు జిల్లా జడ్జి శ్రీనివాసరావు, నందికొట్కూర్ జూనియర్ సివిల్ జడ్జి తిరుమలరావు పూజలు చేశారు. వీరికి ఆలయ మర్యాదలతో అధికారులకు స్వాగతం పలికారు. పూజల అనంతరం వారికి తీర్థప్రసాదాలను అందించారు. శేషవస్త్రాలతో సన్మానించారు. ఈఓ రామకృష్ణ, ఆలయ అధికారులు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.


న్యాయమూర్తులకు తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం